క్లుప్తంగా

విద్యార్థులకు డ్రాయింగ్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు డ్రాయింగ్ కిట్లు పంపిణీ చేస్తున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

మహారాణిపేట: బ్యాంక్ ఆఫ్ బరోడా సిరిపురం శాఖ ఆధ్వర్యంలో జాలరి ఎండాడ ప్రైమరీ స్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థులకు డ్రాయింగ్ కిట్లు అందించారు. సీఎస్ఆర్ నిధుల నుంచి అందజేసిన కిట్లను మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు పిల్లలకు అందజేశారు. బ్యాంకు యాజమాన్యానికి ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సురేష్ కుమార్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యవాణి, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



గణపతి హోమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, భక్తులు

అల్లిపురం: జీకే ఫౌండేషన్, శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నీలమ్మ వేపచెట్టు వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ అక్షరాలు, భాష, మాట, పరస్పర సమన్వయంతో కవిత పుట్టుకొస్తుందన్నారు. మాట కవిత్వంగా ధ్వనించాలంటే రుషితత్వం కావాలన్నారు. అసలైన కవిత్వం ప్రజల సమస్యలను, కన్నీళ్లను సముదాయించి సమాజ సంక్షేమానికి బాట కావాలని పేర్కొన్నారు. కవులు వినయ భూషణ్, కె.రామ్‌ప్రసాద్, సిహెచ్.చిన సూర్యనారాయణ, బి.ఎస్.మూర్తి, కె.వి.ఎ స్.మూర్తి, కె.జగదీశ్వరరావు, వి.హెచ్.రామ్మోహన్, జి.రామమూర్తి, ఆర్.శివాజీ తమ స్వీయ కవితలు చదివి వినిపించారు. చల్లా రాంబాబు కవితలను సమీక్షించారు.

మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రంలో డీఆర్‌ఎం పర్యటన



శిక్షణ కేంద్రంలో ట్రైనీలతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: డీఆర్‌ఎం లలిత్ బోహ్రా బుధవారం మర్రిపాలెంలోని మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రంలో పర్యటించారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న లోకోపైలట్స్, అసిస్టెంట్ లోకో పైలట్స్, ట్రైన్ మేనేజర్లతో ఆయన ముఖాముఖి మాట్లాడి శిక్షణకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. శిక్షణ పొందుతున్న వారంతా ఏకాగ్రత, ఉన్నత ప్రమాణాలు, నిబద్ధతతో విధులు నిర్వర్తించేలా ముందుకు సాగాలని, జాతి నిర్మాణంలో రైల్వేల ద్వారా కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కేంద్రంలోని తరగతి గదులు, మోడల్ రూమ్, కిచెన్‌లను డీఆర్‌ఎం పరిశీలించారు. మల్టీ డిసిప్లినరీ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రనాట్యంపై 12 నుంచి సెమినార్

మద్దిలపాలెం : ఆంధ్ర నాట్యంపై మూడు రోజుల సెమినార్ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14 వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నటరాజ్ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు బి.ఆర్.విక్రమ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 10 సంవత్సరాల వయసు పైబడిన వారంతా పాల్గొనవచ్చన్నారు.

ఆటోవాలా.. విలవిల

రోడ్డున పడ్డ బతుకులు

ఇళ్లకే పరిమితమైన ఆటోలు

ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించలేక అవస్థలు



పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ గుడి జంక్షన్ వద్ద సర్వీసు కోసం ఎదురు చూస్తున్న ఆటోవాలాలు

ఇచ్చిన హామీ ప్రకారం రూ.15 వేలు ఇవ్వాలి..



స్త్రీ శక్తి పథకం వల్ల బేరాలు లేక ఆటోలు ఇళ్లకే పరిమితం అయ్యాయి. బయటికి వెళ్తే కనీసం ఆయిల్ డబ్బులు కూడా రావడంలేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆటోడ్రైవర్లకు ఇస్తామన్న రూ. 15 వేలు కచ్చితంగా ఇవ్వాలి.

– వెంకట అప్పారావు, కల్లుపాకలు

జగదాంబ: నాడు జగనన్న ప్రభుత్వం వాహన మిత్ర పథకం ద్వారా తమకు ఏడాదికి రూ. 10 వేలు ఇచ్చి ఇంటికి పెద్దకొడుకులా ఆదుకుంటే నేడు కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పెట్టి తమ జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్ పేదల పక్షాన పోరాడతానన్నారు. అయితే ఆయనకు ఈవేమీ కనబడడం లేదని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డున పడ్డ ఆటోడ్రైవర్ల జీవితాలు..

రెక్కాడితే గానీ డొక్కాడని తమ జీవితాలు కూటమి ప్రభుత్వం పుణ్యమా అని రోడ్డున పడ్డాయని ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తూ తమ జీవితాలను తలకిందులు చేశారని వాపోతున్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా తమను గాలికి వదిలేశారని మండిపడుతున్నారు. నిరుద్యోగంతో కొందరు.. నిరాక్షరాస్యత, పేదరికంతో మరి కొందరు ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. స్త్రీ శక్తి పథకం వల్ల అనేక మంది ఆటో డ్రైవర్లు ఇంటికే పరిమితం అవుతున్నారు. నెలనెలా చెల్లించాల్సిన వాయిదాలు ఎవరు చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ. 15 వేలు ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన లోకేష్ నేడు కనీసం ఆ దిశగా ఆలోచన చేయడం లేదని వాపోతున్నారు.

కుటుంబ పోషణ భారమైంది..



ఆటో సర్వీసులు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ఒకపక్క ఇన్సూరెన్సులు, మరోపక్క ఆటోల ఇన్‌స్టాల్‌మెంట్లు, పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దె కట్టలేక చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– చిన్న, కల్లుపాకలు

ప్రభుత్వం న్యాయం చేయాలి..



ఆటోడ్రైవర్ల జీవితాలపై దెబ్బ కొట్టిన కూటమి ప్రభుత్వ తీరును అందరి దృష్టికి తీసుకెళ్తాం. సమస్య పరిష్కారం అయ్యే వరకు నగరంలోని ఆటో యూనియన్లతో కలిసి పోరాడతాం. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.

– శ్రీను, గాజులవీధి

ఆర్థికంగా నష్టపోతున్నాం..



మహిళలు ఎక్కువగా ఆటోల్లోనే ప్రయాణిస్తారు. ఉచిత బస్సు పథకం వల్ల వారు ఆటోలు ఎక్కడం లేదు. దీని వల్ల ఆర్థికంగా నష్టపోతున్నాం. నిరుద్యోగ సమస్య వల్ల వాయిదాల పద్ధతిలో ఆటోలు కొన్నాం. ప్రభుత్వమే నిరుద్యోగులను ఆదుకోవాలి.

– రాము, ప్రసాద్‌గార్డెన్స్

పూర్ణామార్కెట్ పరిధిలోనే 1500 ఆటోలు..

జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ పరిధిలో పది ఆటో స్టాండ్‌లు ఉన్నాయి. వీటిలో 1500కు పైగా ఆటోలు ఉన్నాయి. ఇవి కాకుండా రోజూ నగర నలుమూలలు నుంచి పూర్ణామార్కెట్‌కు 400 నుంచి 500 వరకు ఆటోలు సర్వీసు చేస్తుంటాయి. వీరందరు ఆటోలను నమ్ముకుని రోడ్డెక్కితే రోజుకు ఆయిల్ ఖర్చులు పోగా ఇంటికి రూ. 1000 వరకు తీసుకెళ్లేవారు. అయితే స్త్రీ శక్తి పథకం వచ్చిన తర్వాత రోజుకు రూ. 300 కూడా రావడంలేదని వాపోతున్నారు. ఆటోలు స్టాండ్‌లోనే ఉంటున్నాయని, మార్కెట్‌కు వచ్చే ఆటోల సంఖ్య కూడా బాగా తగ్గిపోయిందని చెబుతున్నారు.



ప్రసాద్‌గార్డెన్స్‌లో ఇంటికే పరిమితం అయిన ఆటోలు

కూటమి ప్రభుత్వ మోసాలపై ఇంటింటి ప్రచారం



కల్లుపాకలు ప్రాంతంలో ప్రచారం చేస్తున్న కనకరెడ్డి తదితరులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. 92వ బూత్ పరిధి కల్లుపాకలు ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో కనకరెడ్డి కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీల గురించి ప్రజలకు వివరించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలని అన్నారు. ఈ క్యాక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆది విష్ణురెడ్డి, సౌత్ క్రిస్టియన్ మైనార్టీ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు సువార్తరాజు, మళ్ల బుజ్జి, కర్రిరాము, శేఖర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

5న జగత్ ప్రవక్త మహమ్మద్ జన్మదినం



విరాలు వెల్లడిస్తున్న సీరత్ కమిటీ సభ్యులు

అల్లిపురం: ఈ నెల 5వ తేదీన జగత్ ప్రవక్త 'మహమ్మద్ సల్లెల్లాహు అలేహివసల్లం 1500వ జన్మదిన వేడుకల సందర్భంగా విశాఖ జిల్లా సీరత్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కమిటీ కార్యదర్శి ఎస్.ఎ.కె.జిలానీ, అధ్యక్షుడు మునీర్ బాబా తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ర్యాలీ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు పాత జైలు రోడ్డులోని ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి బయలుదేరి రెడ్నాం గార్డెన్స్, సెవెన్ హిల్స్, జగదాంబ, పూర్ణామార్కెట్ మీదుగా ఇషాక్ మదిని ఔలియా అలైహి దర్గా వద్దకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి సెయింట్ ఎలాసిస్ స్కూలు గ్రౌండుకు శాంతి యాత్ర చేరుతుందన్నారు. ఈ సందర్భంగా మురాదాబాద్ యూపీ వారిచే ధార్మిక ప్రసంగం అనంతరం లంగర్ (తబురుక్) వచ్చిన భక్తులందరికీ భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంతో పాటు ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న ముస్లిం సోదరులు, సోదరీమణులు, ఇమాములు, జమాత్, ముస్లిం యూత్ అసోసియేషన్లు శాంతి ర్యాలీలో పాల్గొని శాంతి యాత్ర జయప్రదం చేయాలని కోరారు. మహిళల కోసం ప్రత్యేక సదుపాయాలు సమకూర్చినట్లు తెలిపారు.


పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

మహారాణిపేట: పోషకాహార కార్యక్రమం ద్వారా తల్లీపిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారం అందుతుందని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కేజీహెచ్ పేరు పొందాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఆకాంక్షించారు. బుధవారం పిల్లల విభాగంలో నేషనల్ న్యూట్రిషన్ వీక్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కేజీహెచ్ ఎన్ఆర్సీ కేంద్రానికి ఉత్తమమైనదిగా గుర్తింపు లభించిందన్నారు. కేజీహెచ్ పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ బీఎస్ చక్రవర్తి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాలుగా కేజీహెచ్ ఎన్ఆర్సీ విభాగంలో కుక్‌గా సేవలందిస్తున్న పి.సతీష్‌ను డాక్టర్ వాణి, డాక్టర్ బీఎస్ చక్రవర్తి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిల్లల విభాగం వైద్యులు డాక్టర్ సత్యకుమారి, డాక్టర్ వసుంధర జ్యోతి, డాక్టర్ హేమారెడ్డి, డాక్టర్ ప్రభ, డైట్ కౌన్సిలర్లు, కుక్‌లు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులతో వాసవీ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు సీతమ్మధారకు చెందిన వాసవీ క్లబ్ ప్రతినిధులు చెరకు శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా బుధవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. మంచి మార్కులు సాధించిన 10 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గిగ్ వర్కర్ల ధర్నా



అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న గిగ్ వర్కర్లు

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గిగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద స్విగ్గీ, జొమాటో రైడర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కుమారమంగళం, అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ జిల్లాలో 40 వేల మంది యువత ఏడేళ్లుగా స్విగ్గీ, జొమాటో వంటి ప్లాట్‌ఫామ్స్‌లో పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అక్రమంగా తొలగించిన ఐడీలను పునరుద్ధరించాలని, 8 గంటలు ఆన్‌లైన్‌లో ఉంటే మినిమం గ్యారంటీ ఆదాయం చెల్లించాలని డిమాండ్ చేశారు. 365 రోజులు ఒకే రకమైన రేటు, ఇన్సెంటివ్, కిలో మీటర్‌కు ఎంత రేటు ఇస్తారో యాప్‌లో చూపించాలన్నారు. బేస్ పే రూ.30కు పెంచాలని, గతంలో ఇచ్చిన విధంగా పీక్ రూ.12, నాన్ పీక్ రూ.10 ఇవ్వాలని కోరారు. ఇన్సెంటివ్‌కు 2 పిక్స్ కంపల్సరీ చేయరాదన్నారు. లేబర్ కమిషనర్ జోక్యం చేసుకుని యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపాలని, లేని పక్షంలో ప్రతి శని, ఆదివారాల్లో సేవలకు బంద్ పాటిస్తామని హెచ్చరించారు. నాయకులు ఎం.శ్రీనివాస్, అచ్యుత్, నాని, అర్జున్, నగరంలో రైడర్లు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

భగవత్ సంకల్పంతోనే అన్నసమారాధనలు



అన్నప్రసాదం వడ్డిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు



వెంకటేశ్వర మెట్టలో అన్నప్రసాదం వడ్డిస్తున్న పీల వెంకట అప్పలనాయుడు, బొడ్డేటి ప్రసాద్

అల్లిపురం: భగవత్ సంకల్పంతోనే అన్నసమారాధనలు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ్ అన్నారు. బంగారమ్మ మెట్ట యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర సిద్ధి వినాయక నవరాత్రులు జరుగుతున్నాయి. దాంట్లో భాగంగా బుధవారం జరిగిన అన్నసమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను కమిటీ సభ్యులు ఆహ్వానించి, గణపతి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సోలాపు అచ్యుత్, కనితి నవీన్, డబ్బాలు సురేష్, బూర్లు సాయి, బూర్లు చిన్న, దుంప అఖిల్ ఆకాష్ జగదీష్, తిరుపతి, ప్రసాద్ సాయి, తరుణ్, తనుష్, దుంప గుణవతి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కణితి బ్రహ్మం, పాల శ్రీహరి రెడ్డి, పిల్లి శివ, కొడమంచిలి శ్రీను, చిన్నమ్ములు, కుమారి, మార్గాను గౌరీ శంకర్, బూరెలు చిన్న, బంటుపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర మెట్టపై..

వెంకటేశ్వర మెట్టపై డీజే బాయ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక మహోత్సవాలలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను సంఘ సేవకుడు పీల అప్పలనాయుడు, 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెంటకోట సంతోష్, ఈశ్వరరావు, దిలీప్, కార్తీక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలను వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం సూర్యాబాగ్‌లో ఉన్న బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ మిషన్ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) ఆధ్వర్యంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. స్టేట్ టెక్నికల్ కన్సల్టెంట్ కోటి రెడ్డి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లక్ష్యాలు వివరించారు. ప్రజలకు అందించాల్సిన సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.అప్పారావు, జిల్లా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నోడల్ అధికారి డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గాయకుడు రామకృష్ణకు స్వర నీరాజనం

సీతంపేట: సినీ నేపథ్య గాయకుడు వి.రామకృష్ణ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో రామకృష్ణకు స్వర నీరాజనం అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో రామకృష్ణ పాడిన పాటలను గాయనీ గాయకులు ఆలపించి అలరించారు. ముందుగా ముఖ్య అతిథి న్యాయవాది ఉప్పలపాటి జానకి రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. చెన్నా తిరుమలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయనీ గాయకులు పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో సన్‌మూర్తి, జి.త్యాగరాజన్, ఏఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించాలి

ఏయూ క్యాంపస్ : పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంచాలని గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ డి.గిరిధర్ అన్నారు. బీచ్‌రోడ్డులోని జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో ఆధునికీకరించిన సైన్స్ ల్యాబ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృత్రిమ మేధ, శాస్త్రీయ ఆవిష్కరణలపై చిన్నారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జీవీపీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్ విభాగం డీన్ ఆచార్య దిట్టకవి సరిత మాట్లాడుతూ తొలి దశలో 8, 9 తరగతుల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి సంబంధించిన కోర్సులు అందిస్తామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధురవాణి, లాలం రాజేష్, ఉపాధ్యాయులు కిరణ్మయి, మాధురి, అరుణ, ప్రవల్లిక పాల్గొన్నారు.

అంకితభావంతో విధుల నిర్వహణ

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



అధికారులతో సమీక్షిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

సీతంపేట: ప్రతి అధికారి అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహించరాదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో బుధవారం జోనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్-3 పరిధిలో ఎన్ని అభివృద్ధి పనులు మంజూరయ్యాయి, అవి ఏ స్థాయిలో ఉన్నాయని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయించాలని, సహాయక ఇంజినీర్లు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. జోన్ పరిధిలో గుర్తించిన అక్రమ కట్టడాలపై తీసుకున్న చర్యలపై ఆరా తీస్తూ అనధికార నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయరాదని, అది జారీ చేసిన అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జోన్ పరిధిలో ఖాళీ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, రోడ్డు విస్తరణ పనులను వెంటనే మొదలు పెట్టాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. ప్లాన్ మంజూరు దరఖాస్తును రెండు రోజుల కంటే ఎక్కువ కాలం తమ లాగిన్‌లో ఉంచకుండా పై అధికారులకు పంపించాలన్నారు.

నూరు శాతం పన్నుల వసూలు

ఆస్తి పన్ను, నీటి చార్జీలు, అద్దెలు, ఆశీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తి పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. వీధి విక్రేతల గుర్తింపు, అన్న క్యాంటీన్ల పరిశీలన నిత్యం చేపట్టాలని యూసీడీ అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ నిత్యం చేపట్టాలన్నారు.

గణేష్ ఉత్సవ నిర్వాహకులకు వాసుపల్లి ఆర్థిక సాయం



విరాళం అందజేస్తున్న వాసుపల్లి

అల్లిపురం: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజు వీధిలో సత్యవతమ్మ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ బుధవారం ఉత్సవాలకు హాజరై గణేషుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అన్నదానానికి రూ. 5 వేలు విరాళం అందించారు. వినాయక చవితి పండగ సందర్భంగా నియోజకవర్గంలో వాడవాడలా జరుగుతున్న అన్నదాన కార్యక్రమాల్లో తనని కూడా భాగస్వామ్యం చేసిన కమిటీ సభ్యులు, స్థానికులకు వాసుపల్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, స్టేట్ కల్చరల్ వింగ్ సెక్రటరీ కంటుముచ్చు సాగర్, 36వ వార్డు ప్రెసిడెంట్ మహ్మద్ షకీల్ తదితరులు ఉన్నారు.

ఏఎంసీలో మైక్రో బయాలజీ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ మైక్రో బయాలజీ విభాగంలో డయాగ్నోస్టిక్ ల్యాబ్ బుధవారం ప్రారంభమైంది. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి ఈ ల్యాబ్‌ను ప్రారంభించారు. కోవిడ్ 19, డెంగ్యూ, చికున్ గున్యా, స్వైన్ ఫ్లూ వంటి వివిధ వైరల్ వ్యాధులకు సిరోలాజికల్, మాలిక్యులర్ డయాగ్నోస్టిక్స్ పరీక్షలు ఈ ల్యాబ్‌లో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్, ఏఎంసీ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి. రాధాకృష్ణన్, అదనపు డైరెక్టర్ ఇ. లోగనాథన్, మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి. రత్నకుమారి, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఇ. శివ కళ్యాణి, మైక్రో బయాలజీ విభాగం మొత్తం అధ్యాపకులు పాల్గొన్నారు.

అరుదైన చికిత్సతో యువకుడిని కాపాడిన వైద్యులు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ విక్రమ్ రెడ్డి ఐరా

అల్లిపురం: మేఫెయిర్స్ సిండ్రోమ్, డైలేటెడ్ అయోర్టిక్ రూట్, అసెండింగ్ అయోర్టిక్ అనూరిజం తదితర సమస్యలతో బాధపడుతున్న 28 ఏళ్ల ఉరితి అనిల్ కుమార్‌కు సంక్లిష్టమైన బెంటాల్స్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ విక్రమ్ రెడ్డి ఐరా తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అరుదైన అయోర్టిక్ అనూరిజమ్స్ వాల్వ్ వ్యాధి ఉన్న అనిల్ కుమార్ సమస్యను సకాలంలో గుర్తించి చికిత్స అందించడం వల్ల విజయవంతం అయిందన్నారు. అతను పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జి అయ్యాడని తెలిపారు. పేషెంట్‌కు శ్వాస ఆడకపోవడం, ఛాతీ నొప్పి వంటి లక్షణాలు కనిపించటంతో వివిధ పరీక్షలు నిర్వహించగా వాటిలో వాల్వ్ పని చేయకపోవడం వంటి డైలేటెడ్ హార్ట్ చాంబర్ సమస్య ఉన్నట్లు డాక్టర్లు కనుగొన్నారన్నారు. శస్త్రచికిత్స తర్వాత అతన్ని ఐసీయూలో నిశితంగా పరిశీలించి క్రమంగా లైఫ్ సపోర్ట్ తొలగించినట్లు తెలిపారు. కొన్ని రోజుల్లోనే అతను బాగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశామన్నారు.